# కులవృత్తులకు భరోసా

## ఆసక్తి చూపుతున్న యువత

- సీఎం కేసీఆర్ ఇచ్చే ఆర్థిక సాయమే కారణం..
- బీసీ కులాల ప్రగతికి సర్కారు ప్రోత్సాహం
- ఆర్థిక పరిపుష్టి సాధిస్తామని ధీమా

*తెలంగాణ సర్కారు కులవృత్తులకు ఆర్థిక భరోసానిస్తున్నది. చేతివృత్తిదారుల ప్రగతికి ప్రోత్సహిస్తున్నది. అందులో భాగంగా వారి పురోభివృద్ధికి రూ.లక్ష ఆర్థికసాయంతో పాటు, కొన్ని కులాలకు సబ్సిడీపై విద్యుత్ అందిస్తున్నది. ఆ కుటుంబాల్లో ఆనందం నింపుతున్నది. సమైక్య రాష్ట్రంలో సాయం చేసే నాథుడు లేక, ప్రోత్సాహం కరువై కులవృత్తులు అంతరించి పోయే పరిస్థితి దాపురించింది. ఆదరణ లేక, చేతినిండా పనిలేక పూటగడవక ఎన్నో కుటుంబాలు పస్తులున్న సందర్భాలున్నాయి. కానీ, తెలంగాణ ఏర్పాటయ్యాక పరిస్థితి మారింది. కులవృత్తులకు పూర్వ వైభవం వచ్చింది. సీఎం కేసీఆర్ అన్ని రంగాలను ఆదరిస్తూ వెన్నంటి ఉంటుండడంతో కుల వృత్తులపై యువత ఆసక్తి చూపుతున్నది. పెద్ద పెద్ద చదువులు పూర్తిచేసినా, తమదైన శైలిలో ముందుకుసాగుతున్నది.* - లక్షెట్టిపేట, అక్టోబర్ 31



ఫర్నీచర్ తయారు చేస్తున్న వడ్రంగులు

ఉమ్మడి రాష్ట్రంలో కులవృత్తులు కనుమరుగయ్యాయి. కుమ్మరి కుండలు.., వడ్రంగి.., నాయీ బ్రాహ్మణుల దుకాణాలు వెలవెలబోయాయి. వృత్తిదారులు ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిపోయారు. కానీ, తెలంగాణ ఏర్పాటై, కేసీఆర్ సీఎం అయిన తర్వాత పరిస్థితి పూర్తిగా మారిపోయింది. కుల వృత్తులను ప్రోత్సహించాలని, వాటికి ప్రాణం పోయాలనే సంకల్పంతో అన్ని రకాలుగా ప్రోత్సహిస్తూ ముందుకుసాగారు. ప్రస్తుతం నాయీ బ్రాహ్మణులు, రజకులు ప్రతీ గ్రామంలో, పట్టణాల్లో వారి పనులు వారు సాగిస్తున్నారు. ప్రభుత్వం వారికి అవసరమయ్యే విద్యుత్‌ను సబ్సిడీపై ఉచితంగా అందిస్తున్నది. దీంతో ఆ కులాల యువత కూడా చేతి వృత్తులపై ఆసక్తి చూపుతున్నది. ప్రభుత్వ ఉద్యోగాలనే నమ్ముకొని కాలం వృథా చేసుకోకుండా చాలా మంది యువకులు కులవృత్తుల దుకాణాలు పెట్టుకొని కుటుంబాలను పోషించుకుంటున్నారు. కుల వృత్తులకు సముచిత స్థానం కల్పించాలనే ఆలోచనతో సీఎం కేసీఆర్ రూ.లక్ష ఆర్థిక సాయం కూడా అందజేశారు. దీంతో ఆయా కులాల్లోని యువకులు ముందడుగు వేశారు. చకచకా దరఖాస్తులు చేసుకుంటూ తమదైన శైలిలో పనులు చేసుకుంటున్నారు. తిరిగి కుల వృత్తులకు ప్రాణం పోయాలని నర్ణయించుకున్నారు. ప్రస్తుత జనరేషన్‌ను బట్టి ముందుకు సాగవచ్చని సాటిచెబుతున్నారు.

### ఉద్యోగం కంటే వృత్తిలోనే తృప్తి..



నేను ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ పూర్తి చేశాను. కొంత కాలం హైదరాబాద్‌లో ప్రైవేట్‌గా జాబ్ చేశాను. చిన్నప్పటి నుంచి మా కుల వృత్తి అంటే చాలా ఇష్టం. చదువుకునే సమయంలో నాన్నతో కలిసి పనికి పోయేవాడిని. ప్రైవేట్‌గా ఉద్యోగం చేసే సమయంలో నాకు ఏ మాత్రం సంతృప్తి లేదు. మా వృత్తిలో ప్రస్తుతం కార్వింగ్ వర్క్‌కు చాలా గుర్తింపు ఉండడంతో జాబ్ చేసుకుంటూ ఆ పని నేర్చుకున్నా. ఇప్పుడు స్వతంత్రంగా కంప్యూటర్ ద్వారా కార్వింగ్ కూడా చేయగలను. సీఎం కేసీఆర్ కుల వృత్తులను ప్రోత్సహిస్తూ ఆర్థిక సాయం చేస్తానని చెప్పడంతో చాలా సంతోషమనిపించింది. ఆ డబ్బుతో కాలానికి అనుగుణంగా మంచి మిషనరీలను కొనుగోలు చేసి, కుల వృతి చేసుకుంట.

**- బానాల అరుణ్‌కుమార్, లక్షెట్టిపేట**

### కుల వృత్తి చాలా ఇష్టం..



మేము కమ్మరి కులస్తులం. మా కుల వృత్తి అంటే నాకు చాలా ఇష్టం. నేను పదో తరగతి వరకు చదివి ఆపేసిన. మా నాన్న ఒక్కడే పని చేసుకుంటూ ఉంటే నాకు చేయాలని కోరిక ఉండేది. చదువు మానేసిన తర్వాత మా నాన్నకు సాయపడుతూ మా పని మేము కొనసాగిస్తున్నాం. ప్రస్తుతం కమ్మరి పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న. సీఎం కేసీఆర్ లక్ష రూపాయల ఆర్థిక సాయం చేస్తానని ప్రకటించడంతో చాలా ఆనందం కలిగింది. ప్రస్తుతం అన్ని మిషన్లతో చేయడం కనుక సీఎం ఇచ్చే సాయంతో కాలానికి అనుగుణంగా మా వృత్తిని పెంపొందించి సంతోషంగా పని చేసుకుంటా. సీఎం కేసీఆర్‌కు ఎళ్లవేళలా నేను నా కుటుంబం ఋణపడి ఉంటాం.

**- నాగుల మల్యాల లక్ష్మణాచారి, తిమ్మాపూర్, లక్షెట్టిపేట**



కుండలు తయారు చేస్తున్న కుమ్మరి

### కులవృత్తులకు ప్రాధాన్యం..



సీఎం కేసీఆర్ నేతృత్వంలో మరుగున పడుతున్న కుల వృత్తులకు మళ్లీ పునర్జీవం పోయాలన్న సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. అందులో భాగంగానే కుల వృత్తులైన నాయీబ్రాహ్మణ, రజక కులస్తులకు ఇప్పటికే ఉచితంగా విద్యుత్ మీటర్లను ప్రభుత్వం కేటాయించింది. ఉచితంగా విద్యుత్ కూడా అందిస్తున్నది. ఇప్పుడు మిగిలిన కుల వృత్తులను కూడా దృష్టిలో పెట్టుకొని వాటన్నింటికీ ఆర్థికసాయం అందిచాలన్న సంకల్పంతో కొత్తగా లక్ష రూపాయలు అందించే పథకం కూడా ప్రారంభించారు. ఇటీవల మొదటి విడుత డబ్బులు కూడా చాలా మందికి అందించాం. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నంత కాలం కుల వృత్తులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తాం. ఇది ముమ్మాటికీ నిజం.


**- నడిపల్లి దివాకర్‌రావు, ఎమ్మెల్యే, మంచిర్యాల**

# ఆహ్లాదం.. పల్లె ప్రకృతివనం

- లింగాపూర్‌లో పచ్చదనంతో కనువిందు
- రకరకాల మొక్కలతో అందంగా..
- అభినందిస్తున్న జిల్లా అధికారులు




లింగాపూర్ పల్లె ప్రకృతివనం



ఏపుగా పెరిగిన మొక్కలు

బెల్లంపల్లి రూరల్, అక్టోబర్ 31 : బెల్లంపల్లి మండలం లింగాపూర్ గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన పల్లెప్రకృతి వనం.. ప్రత్యేకతను సంతరించుకున్నది. వివిధ రకాల పూల, పండ్ల రకాలు, ఔషధ మొక్కలతో పచ్చదనం నింపుకున్నది. చూపరుల మది దోచుకుంటున్నది. గ్రామానికి వచ్చే అధికారులు, గ్రామస్తులకు చక్కని ఆహ్లాదాన్ని పంచుతున్నది. సర్పంచ్ కారుకూరి వెంకటేశ్, ప్రకృతి వనాన్ని అందంగా తీర్చిదిద్దారు. ప్రారంభంలో స్థలం లేకపోవడంతో స్థానిక ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య చొరవతో ఫారెస్ట్ అధికారులు స్థలాన్ని కేటాయించారు. వెంటనే పనులు ప్రారంభించి ప్రకృతి వనం ఏర్పాటు చేశారు. అందులో నాటిన ప్రతీ మొక్కను పంచాయతీ అధికారులు నీళ్లు పోసి పరిరక్షించారు. ప్రత్యేకమైన శ్రద్ధ చూపారు. ప్రస్తుతం మొక్కలు ఏపుగా పెరిగి ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. ఇక్కడి మొక్కలను పరిశీలించిన అప్పటి కలెక్టర్ భారతీ హోళీకేరితో పాటు పలువురు అధికారులు.. మొక్కల పెంపకంలో గ్రామ పంచాయతీ అధికారులు చూపుతున్న కృషిని ప్రత్యేకంగా అభినందించారు. అదే స్ఫూర్తిని నేటి వరకు కొనసాగిస్తుండడంతో పల్లె ప్రకృతివనం ప్రత్యేకమైన గుర్తింపు పొందుతున్నది.

### ప్రతిఫలం దక్కింది..



ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సార్ చొరవతో ఫారెస్ట్ అధికారులు కేటాయించిన స్థలంలో గ్రామం మధ్యలో పల్లె ప్రకృతివనాన్ని ఏర్పాటు చేసుకున్నాం. పంచాయతీ అధికారులు కంటికి రెప్పలా కాపాడుతున్నారు. అందరికీ ఉపయోగపడేలా పూలు, పండ్ల రకాలు, ఔషధ మొక్కలు నాటాం. ప్రతిరోజూ నీళ్లు పోసి కాపాడుకున్నాం. అప్పటి కలెక్టర్ భారతీ హోళికేరి ప్రత్యేకంగా అభినందించారు. గ్రామస్తులు పల్లె ప్రకృతివనంలో ఆసక్తిగా సేదదీరడం చూస్తే చాలా ఆనందమేస్తది. మా కష్టానికి మంచి ప్రతిఫలం దక్కిందన్న భావన కలుగుతున్నది.

**- కారుకూరి వెంకటేశ్, సర్పంచ్, లింగపూర్**

### ప్రత్యేకమైన చర్యలు తీసుకున్నాం..



పల్లె ప్రకృతివనంలో నాటిన మొక్కలను కాపాడేందుకు ప్రత్యేకమైన చర్యలు తీసుకున్నాం. పశువుల నుంచి రక్షణగా చుట్టూ ఫెన్సింగ్ నిర్మించాం. గ్రామ పంచాయతీ సిబ్బందితో రోజూ మొక్కలు ఎండిపోకుండా నీళ్లు పట్టించాం. మొక్కల ఆకృతి చక్కగా వచ్చేలా కటింగ్ చేయించాం. గ్రామసుతలు పల్లె ప్రకృతి వనంలో సేదదీరేలా సిమెంట్ కుర్చీలు వేయించాం. ఇక్కడి గ్రామస్తులు కూడా మొక్కలను సంరక్షించడంలో మాకు సహకరిస్తున్నారు. అందరి కృషితో పల్లె ప్రకృతివనాన్ని అందంగా తీర్చిదిద్దగలిగాం.

**- ప్రసాద్, కార్యదర్శి, లింగాపూర్**

# మధుసూదన్‌కు లయన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ అప్రిసియేషన్ అవార్డు

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 31 : లయన్స్ క్లబ్ మంచిర్యాల స్వర్ణోత్సవ సంబురాల్లో భాగంగా నిర్వహించిన గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాపురావు చేతుల మీదుగా సీనియర్ లయన్ సభ్యుడు వీ మధుసూదన్ రెడ్డి లయన్స్ ఇంటర్నేషనల్ ప్రెసిడెంట్ అప్రిసియేషన్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ.. 2023-24లో లయన్స్ క్లబ్ ఆర్గనైజేషన్ ద్వారా జిల్లాలో వివిధ ప్రాంతాల్లో చేసిన సేవలకు గుర్తింపుగా ఈ అవార్డు లభించిందన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 320 జీ గవర్నర్ హనుమండ్ల రాజిరెడ్డి, ఫస్ట్ వాయిస్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వెంకటేశ్వర్ రావు, మంచిర్యాల అధ్యక్షుడు బాలాజీ తదితరులు పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న మధుసూదన్ రెడ్డి